ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
5
ములుగు
ఆదివారం 29 సెప్టెంబరు 2024



ఎన్నికల నిధులు దుర్వినియోగంపై ఆరా!

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 28: పార్లమెంట్ ఎన్నికల నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు వస్తున్న క్రమంలో 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఈ ఉదంతంపై కలెక్టర్ రాహుల్ శర్మ ఆరా తీస్తున్నట్టు సమాచారం. దీనిపై విచారణ చేపట్టి సమగ్ర వివరాలు అందించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. ఇదే క్రమంలోనే ఎన్నికల డ్యూటీలు చేయని కలెక్టరేట్‌లోని ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు గౌరవ వేతనం పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల నిధుల దుర్వినియోగంపై పలువురు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

రచ్చబండ ఏడబాయె..

ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు

సెల్ లేకుంటే జీవితమే లేదనే రోజులు నేటివి.. ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్ కాలక్షేపం.. పక్కవారి యోగక్షేమాలు పట్టని కాలం. పల్లె నుంచే ప్రపంచాన్ని చుట్టేసే టెక్నాలజీతో ఎదుటి వ్యక్తితో కన్నా.. సోషల్ మీడియాతోనే ఎక్కువ బంధాలను పెంచుకుంటున్న ఈ సమాజంలో ఇప్పటివరకు రచ్చబండలే పల్లె జనం మధ్య అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నిద్ర లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు పల్లెల్లోని సావటి గద్దె వద్ద జరిగే చర్చలెన్నో.. ఊరి పంచాయతీలు, సాధక బాధలు, గ్రామంలోని సమస్యలు, భార్యాభర్తల పంచాయితీలు, పోరగాళ్ల అల్లర్లు గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాల వరకు చర్చలకు ఈ సావటి గద్దెలు వేదికగా నిలుస్తున్నాయి. పల్లె పాలిట్రిక్స్ నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల వరకు కూడా చర్చించేందుకు రచ్చబండలే అడ్డాలు. ప్రస్తుతం అనేక గ్రామాల్లో రచ్చబండలు, సావటి గద్దెలు కనుమరుగై పోగా.. ఇంకా అక్కడక్కడా రచ్చబండల వద్ద సందడిగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రచ్చబండ ముచ్చట్లపై ఈ ఆదివారం ప్రత్యేక కథనం..

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- పంచాయితీలకు, చర్చలకు, తీర్మానాలకు స్థానాలు
- మంచి, చెడు పంచుకునేందుకు పల్లె జనానికి ధర్మశాలలు
- అభివృద్ధి, అవినీతి, సమకాలీన రాజకీయాలపై అవగాహన
- పల్లె జనం ఐక్యతకు సజీవ సాక్ష్యంగా ఊరు సావటి గద్దెలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు



శాయంపేట మండలం కొప్పులలో రచ్చబండ వేదిక



7

Sunday SPECIAL

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్న ప్రాణికి కూడాహాని జరగని వైనం
- వైపరీత్యాన్ని ముందే పసిగట్టిన మూగజీవాలు
- మోరంచ, కొండాయిలో వరదను అంచనా వేయలేకపోయిన జనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరీత్యాలకు కారణాలపై చర్చోపచర్చలు

7లో

క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జలప్రళయాలు.. ఎక్కడో నడి సముద్రంలో అలజడితో ఇక్కడి అడవుల్లో పెనుగాలుల విధ్వంసం... అసలు ఈ ప్రకృతి ప్రకోపానికి కారణాలు ఏంటి? ఓరుగల్లు పరిసర ప్రాంతాల్లోనే ఎందుకు ఈ విధ్వంసం జరుగుతోంది? ఇవే ఇప్పుడు పరిశోధకులను.. ప్రకృతి ప్రేమికుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు. ప్రకృతి వైపరీత్యాలను జంతువులు, పక్షులు ముందే పసిగడుతున్నాయా? ఆ శక్తిలేకనే జల ప్రళయాలకు మానవులు జలసమాధి అవుతున్నారా? అనే చర్చ కూడా విస్తృతంగా జరుగుతోంది. రెండుమూడేళ్లుగా వరుసగా తలెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాలు ఓరుగల్లువాసులను టెన్షన్ పెడు తున్నాయి. వీటిని శాస్త్రవేత్తలు ఛేదించేనా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మేడారం అడవుల్లో నేలకూలిన చెట్లు (ఫైల్)



\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సన్నాలకు జై

- మొగ్గు చూపుతున్న ములుగు రైతాంగం
- 80 వేల ఎకరాల్లో పంట
- రూ.500 బోనస్‌పై ఆసక్తి



ములుగు, సెప్టెంబరు 28: సన్న బియ్యంతో వండిన అన్నమైతేనే సగటు పౌరుడికి ముద్ద దిగుతుంది. మారిన ఆహారపు అలవాట్ల నేపథ్యంలో సన్న బియ్యం వాడకం భారీగా పెరిగింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉత్పత్తి తక్కువ.. వినియోగం ఎక్కువ కావడంతో కొందరు ఘనులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఈక్రమంలో సన్న బియ్యం కొరతను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటన చేసింది. దీంతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఫలితంగా జిల్లాలో సన్న వడ్ల సాగు గణనీయంగా పెరిగింది. హాస్టళ్లు, వసతి గృహాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకాల్లో పూర్తిగా సన్నబియ్యమే ఉపయోగిస్తుండటంతో భవిష్యత్తులో ఏర్పడే కొరత, పెరిగే ధరలను నియంత్రించేందుకు ఈపరిణామం పరిష్కార మార్గంగా మారనుంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు దిగివచ్చి సామాన్యులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలూ ఉన్నాయి.

80,374 ఎకరాల్లో సాగు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాల సీజన్‌లో 94,235 ఎకరాలలో వరి పంట సాగవుతోంది. మొత్తం విస్తీర్ణంలో 80,374 ఎకరాల్లో సన్న వడ్లు పండిస్తుండటం గమనార్హం. దొడ్డు రకాలు కేవలం 13,861 ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. జిల్లా చరిత్రలో తొలిసారిగా 99 శాతం సన్న వడ్లను సాగు చేస్తుండం ఓ రికార్డు. ములుగు మండలంలో కేవలం 30 ఎకరాల్లో దొడ్డు రకం సాగవుతుండగా అత్యధికంగా 16,400 ఎకరాల్లో సన్న రకాలను పండిస్తున్నారు. ఏటూరునాగారం మండలంలో వేల ఎకరాల్లో సన్నాలు, 3,500 ఎకరాల్లో దొడ్డు రకం, గోవిందరావుపేటలో 11,567 ఎకరాల్లో సన్నాలు, 1,700 ఎకరాల్లో దొడ్డు, కన్నాయిగూడెం మండలంలో 2,487 ఎకరాల్లో సన్న, 110 ఎకరాల్లో దొడ్డు, మంగపేటలో 17,868 ఎకరాల్లో సన్న, 11,600 ఎకరాల్లో దొడ్డు, తాడ్వాయిలో 4,573 ఎకరాల్లో సన్న, 2,225 ఎకరాల్లో దొడ్డు, వెంకటాపురం(నూగూరు)లో 4,611 ఎకరాల సన్న, 1,012 ఎకరాల్లో దొడ్డు వడ్లు సాగు చేస్తున్నారు. వాజేడు మండలంలో 2,993 ఎకరాల్లో సన్న, 2,690 ఎకరాల్లో దొడ్డు, వెంకటాపూర్ (రామప్ప) మండలంలో 13,875 ఎకరాల్లో సన్న, 997 ఎకరాల్లో దొడ్డు రకం వడ్లను సాగుచేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, పోటెత్తిన వరదలకు ఏటూరునాగారం, మంగపేట మండలాలలో వరిచేలు కోతకు గురికాగా మళ్లీ నాట్లు వేస్తున్నారు. దీంతో సన్నాల సాగు మరో వెయ్యెకరాలు పెరిగే అవకాశముంది.

క్వింటాకు రూ.500 బోనస్

సన్నరకం ధాన్యం సాగు శ్రమతో కూడుకున్న పని. దొడ్డు రకాలతో పోల్చుకుంటే ఈ పైరుకు చీడల బెడద ఎక్కువ. ఎరువులు, పురుగు మందుల ఖర్చు కూడా పెరుగుతుంది. రెండు రకాల మధ్య ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరలో వ్యత్యాసం కేవలం రూ.30 మాత్రమే. దొడ్డు రకం క్వింటా ధాన్యానికి రూ.2,300 కాగా, సన్న రకానికి రూ.2320. దీంతో అనాదిగా రైతాంగం దొడ్డు రకాలనే సాగుచేస్తున్నారు. ఈనేపథ్యంలో కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు బోనస్ ప్రకటన చేసింది. క్వింటా వడ్లకు కనీస మద్దతు ధరకు అదనంగా రూ.500 ఇస్తామని చెప్పింది. ఈసీజన్ ధాన్యం సేకరణ సమయంలో బోనస్‌ను అమలు చేయనున్నారు. సీజన్ ప్రారంభంలోనే వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్‌బుకింగ్ సర్వే చేశారు. క్షేత్రస్థాయిలో రైతులను కలిసి మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లింపుపై అవగాహన కల్పించారు. దీంతో ప్రభావితమైన రైతులు సన్నాల సాగుకు మొగ్గుచూపారు.

రేషన్ దుకాణాల్లోనూ ఆ బియ్యమే..

ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా దారిద్రరేఖకు దిగువున్న కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ జరుగుతోంది. అయితే.. ఆ బియ్యం దొడ్డురకం కావడంతో చాలామంది

మిగతా 8వ పేజీలో...

డబ్బులిస్తే జాబ్ నీదే..!



- వైద్యశాఖ ఉద్యోగాల అభ్యర్థులకు గుర్తు తెలియని వ్యక్తి గాలం
- ఫోన్లు చేసి డబ్బులు వసూలు
- రూ.50 వేలు, రూ.20 వేల చొప్పున అడ్వాన్స్
- జాబ్‌లో చేరాక రూ. 2.50 లక్షలు చెల్లించాలంటూ షరతు
- జనగామలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

జనగామ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'స్టాఫ్ నర్సు ఉద్యోగానికి ఎంపిక అయ్యావు. ఉద్యోగం కావాలంటే రూ. 3 లక్షలు ఇవ్వాలి. అడ్వాన్స్‌గా రూ. 50 వేలు, జాబ్‌లో చేరాక రూ.2.50 లక్షలు ఇవ్వాలి' అంటూ మహిళా ఉద్యోగార్థులను మోసం చేసిన ఉదంతం జనగామ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ తాజాగా జరుగుతున్న ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో కొత్త తరహా మోసం వెలుగు చూసింది. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫోన్లు చేస్తూ ఉద్యోగానికి ఎంపిక అయ్యారంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. వివరాల్లోకెలితే.. జనగామ జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 32 పోస్టులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ అయింది. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు, ఇతరత్రా కారణాల వల్ల నియామక ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. కాగా.. తాజాగా నియామక ప్రక్రియను వైద్యాధికారులు ప్రారంభించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న గుర్తు తెలియని నేరగాళ్లు అభ్యర్థుల నుంచి డబ్బుల వసూళ్లకు తెర లేపారు. స్టాఫ్ నర్సు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ముగ్గురు మహిళా అభ్యర్థులకు ఇటీవల ఓ ఆగంగకుడు కాల్ చేశాడు. తాను జిల్లా వైద్యాధికారి సీసీగా ఏడేళ్లుగా పనిచేస్తున్నానంటూ ఫోన్‌లో పరిచయం చేసుకున్నాడు. 'మీరు స్టాఫ్ నర్సు ఉద్యోగానికి ఎంపిక అయ్యారు' అంటూ నమ్మబలికాడు. ఉద్యోగం కావాలంటే రూ. 3 లక్షలు చెల్లించాలని, తక్షణమే అడ్వాన్స్ కింద రూ. 50 వేలు చెల్లిస్తే ఉద్యోగాన్ని కన్ఫార్మ్ చేస్తామని, లేదంటే వేరొకరికి ఇస్తామంటూ అభ్యర్థులకు షరతు పెట్టాడు. దీనిని నమ్మిన ఇద్దరు మహిళా అభ్యర్థులు ఒకరు రూ. 50 వేలు, మరొకరు రూ.20 వేల చొప్పున ఫోన్ పే ద్వారా ఆగంతకుడు చెప్పిన నంబర్‌కు పంపించారు. అనంతరం ఫోన్ చేయగా ఆగంతకుడు స్పందించలేదు. ఇదే క్రమంలో పాలకుర్తి మండలం శాతాపురానికి చెందిన తేజస్విని అనే అభ్యర్థికి ఈనెల 20న అదే విధంగా కాల్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చిన ఆమె జనగామలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఈనెల 23న వచ్చి విషయాన్ని అధికారులకు చెప్పింది. దీంతో అప్రమత్తమైన అధికారులు డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశారు.



డబ్బులంటూ ఫోన్ చేస్తే ఫిర్యాదు చేయాలి

ఎన్‌హెచ్‌ఎం పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్లు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. కొంతమందికి గుర్తు తెలియని వ్యక్తి ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఫోన్లు చేస్తూ డబ్బులు వసూలు చేశారని తెలిసిందన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగినంటూ చెప్పి ఇద్దరు మహిళా అభ్యర్థుల నుంచి గుర్తు తెలియని వ్యక్తి రూ. 50 వేలు, రూ. 20 వేల చొప్పున వసూలు చేసినట్లు తెలిసిందన్నారు. మరో మహిళా అభ్యర్థితో అదేవిధంగా మాట్లాడగా అనుమానం వచ్చి ఆమె ఈనెల 23న జనగామకు వచ్చి మాకు విషయాన్ని తెలిపిందన్నారు. దీంతో ఈ విషయంపై అదే రోజు డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉద్యోగాల భర్తీలో ఎలాంటి డబ్బులు వసూలు చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులంటూ ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

దేశానికి బలం.. యువత

ములుగు కలెక్టర్ దివాకర

ఉత్సాహంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 28: యువత దేశానికి బలమని, వారి చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ములుగులోని గిరిజన భవన్‌లో శనివారం యువజనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సైన్స్ మేళా, యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలన్నారు. యువజనుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు దోహదపడుతాయని తెలిపారు. వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని సన్మార్గాన్ని ఎంచుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, యువతీయువకుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి తుల రవి పాల్గొన్నారు.



యువజనోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




గీత కార్మికులకు రక్షణ కవచాలు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 28: కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం 76 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గీత కార్మికులు చెట్లు ఎక్కే

మిగతా 8వ పేజీలో...

బయటపడ్డ పురాతన విగ్రహాలు






బయటపడ్డ శివలింగం, త్రిముఖ ఆకారంలో ఉన్న విగ్రహం

వాజేడు, సెప్టెంబరు 28: ములుగు జిలత్లా వాజేడు మండలంలోని చెరుకూరులో పురాతన విగ్రహాలు బయటపడుతున్నాయి. అంజనేయ స్వామి మందిరం వద్ద గతంలో శివలింగం, వినాయకుడి చిన్న విగ్రహం, తాబేలు, తామర పువ్వు ఆకారంలో ఉన్న రాతి విగ్రహాలు బయటపడ్డాయి. తాజాగా శుక్రవారం సాయంత్రం త్రిముఖ ఆకారంలో ఉన్న బ్రహ్మ దేవుడు విగ్రహం బయటపడింది. ఆంజనేయ మందిరం సమీపంలో రెండు రోజుల క్రితం వర్షం కురవగా విగ్రహం బయట పడింది. దీంతో స్థానికులు విగ్రహాన్ని శుభ్రపర్చి పూజలు నిర్వహించారు. విగ్రహాలు బయటపడుతున్న ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆలయం ఉండేదని స్థానికులు అంటున్నారు.

కాలక్రమేణా ఆ ఆలయం భూగర్భంలో కలిసిపోయిందని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో చాలా విగ్రహాలు ఉంటాయని అంటున్నారు. శిలలపై చెక్కిన దేవుడి ఆకారాలు కనిపించడంతో స్థానికులు అక్కడ పూజలు నిర్వహిస్తుంటారు. గతంలో పలు మార్లు గుర్తుతె లియని వ్యక్తులు గుప్తనిధుల కోసం ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిపినట్లు స్థానికులు తెలిపారు.





బుల్లి వినాయక విగ్రహం, తాబేలు ఆకారంలో ఉన్న విగ్రహం

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

ములుగులో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది భారీ ర్యాలీ



ములుగులో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

ములుగు, సెప్టెంబరు 28: తాడ్వాయి మండలం దామెరవాయి అడవుల్లో అక్రమ పోడును అడ్డుకునేందుకు ప్రయత్నించిన అటవీశాఖ సెక్షన్, బీట్ అధికారులపై పైశాచికంగా దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ శాఖ అధికారులు, సిబ్బంది జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌వో కార్యాలయం నుంచి బయల్దేరి జాతీయ రహదారి మీదుగా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌కు వినతి పత్రాలను సమర్పించారు. అటవీ సంరక్షణ కోసం రాత్రింబవళ్లు పనిచేస్తున్న తమకు రక్షణ కల్పించాలని కోరారు. అడవులను కాపాడటం అందరి బాధ్యత అని, విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులపై కొందరు వ్యక్తులు మారణాయుధాలతో దాడికి పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాయకులు సాంబు, శ్రీనివాస్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు సత్తయ్య, శీతల్, శంకర్, చంద్రమౌళి, బాలరాజు, రెహమాన్, ములుగులోని ఎఫ్ఆర్‌వోలు, ములుగు, భూపాలపల్లి జిల్లాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి

▸▸ ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్



మాట్లాడుతున్న మూగల కుమార్ యాదవ్

న్యాయంపేట, సెప్టెంబరు 28: విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అన్నారు. ఫైన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్ రోడ్‌లోని డీకన్వెన్షన్ హాల్‌లో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాన్స్‌లు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం చైర్మన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులే భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. వేడుకలలోఫైన్ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.రాజేంద్ర కుమార్, జక్కుల శ్రీనివాస్, మూగల రమ, మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ మారబోయిన రాజుగౌడ్, కె.శ్రీనివాసన్, ప్రశాంత్, సంధ్య, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

▸▸ హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు

▸▸ లోక్ అదాలత్‌లో 11,618 కేసుల పరిష్కారం

వరంగల్ లీగల్, సెప్టెంబరు 28: రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని, తద్వారా వివాదాలకు స్వస్తి పలకాలని వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు బీవీ నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి జడ్జి అపర్ణాదేవి సూచించారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో వారు పాల్గొని స్నేహపూర్వక వాతావరణంలో ఇరు పక్షాలకు ఆమోద యోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొందాలని వారు సూచించారు. పలు మార్లు కోర్టుల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసాలకు పాల్పడకుండా జాతీయ లోక్ అదాలత్ సహకరిస్తుందని వారు పేర్కొన్నారు. కక్షిదారుల కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని న్యాయమూర్తులు సూచించారు.

కాగా, జాతీయ లోక్ అదాలత్ ఆదేశానుసారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల జాతీయ లోక్ అదాలత్‌లో 11,618 కేసులు పరిష్కరించారు. వరంగల్ జిల్లాలో 9 బెంచిలను ఏర్పాటు చేసి 106 సివిల్ కేసులు, 66 రోడ్డుప్రమాద బీమా కేసులు, 3,771 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 40 పరిష్కరించారు. అదే విధంగా 2,311 విద్యుత్ శక్తి పీఎల్‌సీ కేసులు కూడా పరిష్కరించారు. హనుమకొండ జిల్లాలో 8 బెంచిలు ఏర్పాటు చేసి సివిల్ కేసులు ఏడు, ఎంటీవోపీ కేసులు 67, 7625 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 42 పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు తమతమ బెంచిల ద్వారా కేసులు పరిష్కరించి సహకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో బాలుడి కిడ్నాప్

▸▸ దర్యాప్తు చేస్తున్న పోలీసులు



వివరాలు తెలుపుతున్న బాధితులు

కాజీపేట, సెప్టెంబరు 28 : భార్యభర్తల గొడవ పడుతుండగా.. ఇదే అదునుగా భావించిన ఓ జంట.. బాలుడిని తీసుకుని ఉడాయించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ కుమారుడిని ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఎస్‌కే మసూద్, కౌసర్ దంపతులకు అయాన్, ఇఫ్తార్ ఇద్దరు కుమారులు. కుమారులను తీసుకుని శుక్రవారం జనగామకు వెళ్లేందుకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అప్పటికే రైళ్లు వెళ్లిపోవడంతో బస్సులో వెళ్లేందుకు కాజీపేట చౌరస్తా సమీపంలోకి వచ్చారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. భార్య కౌసర్ తన చిన్నకుమారుడు ఇఫ్తార్‌ను తీసుకుని కాస్త ముందుకు వెళ్లింది. మసూద్ తమ ఐదేళ్ల పెద్ద కుమారుడు అయాన్‌ను అక్కడే ఉన్న ఓ జంటకు అప్పగించి భార్యను వెనక్కి తీసుకురావడానికి వెళ్లాడు. అతడు భార్యను తీసుకువచ్చేలోపు పెద్దకుమారుడిని అప్పగించిన దంపతులు బాబును తీసుకుని ఉడాయించారు. బాధితులు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబరు 2న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ చెస్‌సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలోని తుషార హైస్కూల్‌లో జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ స్థాయి అండర్-15 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న రెండోర్యాంకింగ్ చెస్ టోర్నీలో 1జనవరి 2009 సంవత్సరం, ఆ తరువాత జన్మించి వారు అర్హులని తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకై 9059522986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రచ్చబండ ఏడబాయె..

- ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పల్లె అంటేనే ఐక్యతకు మారు పేరు. నక్సలిజం, కమ్యూనిజం, కాషాయిజం అన్ని ఇజాలు కలిసిన ప్రజలు సహజీవనం చేసే ఓరుగల్లులో ప్రతీ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఒకప్పుడు ఊరూరా రచ్చబండలు, సావటి గద్దెలు, ధర్మశాలలు ఉండేవి. నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల పల్లెల్లోనే ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలకు కాలక్షేపంగా కూడా రచ్చబండలు పనిచేసేవి. ఎప్పుడూ ఓ పదిమంది సావటి గద్దె, రచ్చబండలపై కూర్చుని ఊరుముచ్చట్లతో పాటు రైతు సమస్యలు, రాజకీయాల గురించి మాట్లాడుకోవటం ప్రతీ ఊళ్లో కనిపించే దృశ్యాలే. పండుగలొచ్చినా.. పబ్బులొచ్చినా.. గ్రామంలో ఏ సంఘటన జరిగినా సమాచారం మొత్తం ఈ రచ్చబండలకు చేరేది. ఊళ్లో ఏ గల్లీలో చిన్న గొడవలైనా, భార్యాభర్తల పంచాయితీ అయినా సరే.. సావటిల్లో చర్చనీయాంశంగా మారేది. ఇప్పుడే సాంకేతికత బాగాపెరిగిపోడటంతో యువతతోపాటు నడివయస్సు వారు కూడా సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. పక్కోడి కష్టం కంటే సెల్‌లో సోల్లుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడా అనేక గ్రామాల్లో ఇంకా ఈ రచ్చబండ సంస్కృతి దర్శనమిస్తుండగా, మరికొన్ని చోట్ల సావటిలు వెలవెల పోతున్నాయి.



శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో రచ్చబండ వేదిక

రచ్చబండలపై సమయం తెలిసేది కాదు..

కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, నవాబుపేట

గ్రామాల్లో పాత రోజులే బాగుండేవి. మా గ్రామంలో అప్పటి సర్పంచ్ కాల్వ లక్ష్మారెడ్డి ఇంటి వద్ద రచ్చబండ ఉండేది. అక్కడ కూర్చుంటే సమయం తెలిసేది కాదు. కథలు, నాటికలు, గ్రామ సమస్యలు, తగాదాల పరిష్కారాలతో సమయం తెలిసేది కాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రచ్చబండ కాడ కూర్చొని ఒకరి ఇబ్బందులు, సమస్యలు మరొకరితో చెప్పుకునే వాళ్లం. ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో అందరూ కలిసి ముచ్చట్లు చెప్పుకునేటోళ్లం. ఇప్పుడు స్వార్థాలు పెరిగాయి. కాలక్షేపానికి నలుగురితో కలిసి ముచ్చటించే సమయం దొరకడంలేదు. అలాంటి ప్రత్యేక స్థలాలు లేవు.

\- చిట్యాల



చెట్టు కిందే అన్ని సమస్యలకు పరిష్కారం

రచ్చబండ అంటే సామాన్యంగా భారీ చెట్ల కింద ఏర్పాటు చేసే పంచాయితీ కేంద్రం గ్రామస్థులు కలుసుకునే ప్రదేశంగా, వారి సమస్యలను చర్చించే వేదికగా, పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశంగా ఇవి ఉపయోగపడేది. చాలా గ్రామాల్లో రచ్చబండలు ఉండేవి. అక్కడ వెలువడే తీర్పును ప్రజలు పరమావధిగా భావించేవారు. విడాకులు, వరకట్నం, భూపంచాయతీలు, ప్రేమ వివాహాలు, గట్ల పంచాయతీ ఇలా రోజు ఊరిలో జరిగే ఏదో వివాదాన్ని అక్కడ పరిష్కరించేవారు. ఇరు వర్గాలకు రాజీ కుదిర్చేవారు.

\- వెంకటాపూర్(రామప్ప)

గ్రామాభివృద్ధి చర్చలకు వేదికలుగా ఉండేవి

కత్తాల రాంచందర్‌రావు, ధర్మరావుపేట



నా చిన్ననాటి హయాంలో గ్రామాలు, తండాల్లో పెద్దపెద్ద వృక్షాల కింద చావడిలు, రచ్చబండలు ఉండేవి. నాడు గ్రామపెద్దలు, వృద్ధులు రచ్చబండల వద్ద కాలక్షేపంతో పాటు ఊరు బాగోగుల కోసం ఉదయం, సాయంత్రం వేళ్లలో ఒక్కచోట పోగై చర్చించుకునేవారం. రాజకీయాలపై చర్చలు జరిగేవి. ఒకొక్కరి బాగోగులు, యోగక్షేమాలు సైతం చర్చించుకునేవాళ్లం. దీంతో గ్రామస్తుల మధ్య ఐక్యత, ఆపాయ్యత పెరిగేది. నేడు ఉరుకుల పరుగుల జీవితంతో పాటు, ఆధునిక సాంకేతికత పెరగడంతో టీవీలు, సెల్‌పోన్ల వినియోగం పెరగడంతో ఎవరి ఇంట్లో వారే ఉంటున్నారు. అదేవిదంగా గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్నాలవైపు వెళ్తుండటంతో రచ్చబండలు, గ్రామాల్లోని ప్రధాన కూడల్లోని చావడీలు కనుమరుగయ్యాయి.

\- ఖానాపురం

ఆనాటి ముచ్చట్లు ఏమాయే..

వెలవెలబోతున్న రచ్చబండ వేదికలు

గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండ ముచ్చట్లు కాలక్రమేణా మాయమై పోతున్నాయి. గ్రామంలో ఏ నలుగురు కలిసినా సహజంగా మర్రి, వేప, రాల చెట్ల కింద రచ్చబండపై కూర్చుని, ముచ్చట్లు పెట్టుకుంటూ కాలక్షేపం చేసేవారు. ఊరు సంగతులు.. వ్యవసాయం ఎట్లా ఉంది.. పిల్లగాండ్లు ఏడ సదువుతున్నారు.. ఏం చేస్తున్నారు.. గ్రామంలో సమస్యలు.. నాయకుల పనితీరు.. గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు రాజకీయపార్టీల అనుకూల, వ్యతిరేక విషయాలు ఇలా అనేక విషయాలను చర్చించుకునేవారు. ఇవే కాకుండా కుటుంబ, గ్రామ, భూమి, తదితర తగాదాలను సైతం రచ్చబండల ద్వారా పరిష్కరించుకున్న సందర్భాలు అనేకం. ఇలాంటి నేపథ్యమున్న రచ్చబండలు క్రమేణా గ్రామస్తుల ముచ్చట్లకు దూరమయ్యాయి. సాంకేతిక పెరగడంతో పిల్లల నుంచి మొదలు వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్, టీవీ, కంప్యూటర్లకు అలవాటు పడిపోయారు. ఒకరితో మరొకరు సమయం గడపడమే మర్చిపోతున్నారు.

మాట్లాడుకుంటూ రేడియోలో వార్తలు వినేవాళ్లం

బయ్యు సాంబయ్య, కొప్పుల



గ్రామస్తులంతా రచ్చబండపై కూర్చుని అన్ని విషయాలు మాట్లాడుకుంటూ.. రేడియోలో వార్తలు విని, ఆ వార్తలపై చర్చించుకునేవాళ్లం. కానీ నేడు రచ్చబండ వద్దకు రావడానికి కూడా ఎవరికీ సమయం లేకుండా పోయింది. భవిష్యత్తు తరాలకు రచ్చబండ అనే పదమే తెలియని పరిస్థితి నెలకొంది.

ఆ రోజులే బాగుండేవి..

భూతాల వీరయ్య, హుస్సేన్‌పల్లి



గ్రామంలోని విషయాలన్నీ రచ్చబండపై కూర్చుని ఒకే కుటుంబంలాగా రాత్రి పొద్దుపోయేవరకు మాట్లాడుకునే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఆరోజులే బాగుండేవి. నేడు కనీస పలకరింపులే కరువయ్యాయి.

\- శాయంపేట

పండుగ రోజుల్లో రైల్వే ప్రయాణికులకు కొత్త కష్టాలు

- కాజీపేటలో ఇంటర్‌లాక్ పనులు
- 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు
- అక్టోబరు 2 నుంచి తిరుపతికి స్పెషల్ రైలు



కాజీపేట రైల్వే స్టేషన్‌లో రద్దీ

కాజీపేట, సెప్టెంబరు 28: దసరా, దీపావళి పండుగ రోజులు వస్తున్నాయి. అక్టోబరు 2నుంచి విద్యా సంస్థలకు సెలవులు మొదలుకానున్నాయి. సొంతూళ్లకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఈసారి కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. హసన్‌పర్తి-వరంగల్, హసన్‌పర్తి-కాజీపేట మీదుగా బైపాస్ రైల్వే లైన్ల నిర్మాణంతో ఈ రూట్లలో పండుగకు ప్రకటించిన 47 ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. దీంతో గూడ్స్ రైళ్లను రీ షెడ్యూల్ చేసి మరీ ప్రత్యేకంగా పండుగ రైళ్లను అతి కష్టం మీద కొన్ని రైళ్లను నడపడానికి ప్రణాళికలు చేస్తున్నారు. 38 రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. అసలే ప్రత్యేక రైళ్లు సరిపోని తరుణంలో 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు కావడంతో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు..

దసరాకు కాజీపేట మీదుగా తిరుపతికి ప్రత్యేక రైళ్లు

అక్టోబరు 2 నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మీదుగా 28 సర్వీస్‌లను నడిపించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. (07041) సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే ఈ స్పెషల్ రైళ్లు అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, నవంబరు 1, 6, 8, 13, 15 వ తేదీల్లో నడవనుంది, ఈ రైలు సికింద్రాబాద్‌లో సాయంత్రం 5.50 నిమిషాలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 7.52కు చేరకుంటుంది. (07042) తిరుపతి - సికింద్రాబాద్ స్పెషల్ రైలు అక్టోబరు 3, 5, 10, 12, 17, 19, 24, 28, 31, నవంబరు 2, 7, 9, 14, 16, తేదీల్లో నడవనుంది. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో తిరుపతిలో ఉదయం 9.40 నిమిషాలు బయలుదేరి మరునాడు ఉదయం 5.23కు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లకు అప్ అండ్ డౌన్ రూట్లలో కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ప్రతీ సోమవారం గచ్చిబౌలికి ప్రత్యేక బస్సు

బాలసముద్రం, సెప్టెంబరు 28: వరంగల్, హనుమకొండ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు గచ్చిబౌలి ప్రాంతానికి ప్రయాణిస్తుంటారని, వారికి సౌకర్యంగా ప్రతీ సోమవారం హనుమకొండ నుంచి గచ్చిబౌలికి ప్రత్యేక రాజధాని బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఈ బస్సు ప్రతీ సోమవారం ఉదయం 5గంటలకు హనుమకొండ నుంచి బయలుదేరి ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి వరకు చేరుకుంటుందని టికెట్ ధర రూ.450 అని, ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఉద్యోగస్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు.

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్నప్రాణికీ హాని జరగని వైనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరిత్యాలకు కారణాలపై చర్చోపచర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కొన్నేళ్లుగా ఓరుగల్లు పరిసరాల్లో ప్రకృతి విధ్వంసం దేనికి సంకేతాలనే చర్చ జరుగుతోంది. ఆగస్టు 31న సాయంత్రం మేడారం అడవుల్లో ఏకకాలంలో కుంభవృష్టి వానతో పాటు పెనుగాలులు సృష్టించిన బీభత్సం పర్యావరణ శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్న రహస్యాలను కనుగొనేందుకు శాస్త్రీయ కారణాలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు, ఫారెస్ట్ రిటైర్డ్ అధికారులు, జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్‌ఏఆర్‌ఎల్) ఎన్‌జీఆర్‌ఐ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ), ఐఎండీ శాస్త్రవేత్తలు టోర్నడోలపై అధ్యయనం చేస్తున్నారు. వరంగల్ నిట్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు సైతం ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్నకారణాలను తెలుసుకునే పనిలో పడ్డారు.

వాస్తవానికి మేడారం అడవుల్లోకి జాతరకు ఒకప్పుడు ఎడ్ల బండ్లపైనే వచ్చేవారు. కానీ పదిహేనేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. తద్వారా పెరిగిన గాలి కాలుష్యం వాతావరణ సమతుల్యతను దెబ్బతీయటంతో పాటు కార్బన్ డయాక్సైడ్, మీథేన్ లాంటి విషవాయువులు సరస్సులు, చెరువులు, సముద్రాలు, గోదావరి నీటి తేమని పైకి వెళ్లకుండా కట్టడి చేస్తుందని, ఫలితంగా గాలిలో పయనించి తేమ పొరలా ఏర్పడి వర్షం రూపంలో ఒకేచోట (క్లౌడ్‌బరస్ట్) కుంభవృష్టిగా పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనినే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌గా కేయూ ప్రొఫెసర్ ఒకరు అభివర్ణించారు. ఈ కారణంతోనే ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో గతేడాది జూలై 27వ తేదీన 64.98సె.మీ వర్షం కురిసి ఉండవచ్చుననే అభిప్రాయాలను పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో మేఘాలు ఇళ్లపైకి రావడానికి, చిలుకలగుట్ట పైన ఏర్పడిన సుడిగాలికి కూడా ఇదే కారణమై ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది ఆగస్టు 31న బంగాళాఖాతంతో పాటు అరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం పెనుగాలులు సుడులుగా మారి మేడారం అడవుల్లో విధ్వంసం సృష్టించి ఉండవచ్చుననే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. భారీగా వృక్షసంపద నష్టానికి ప్రధాన కారణం చెట్ల ఎదుగుదల కూడా ఒకటిగా చెబుతున్నారు. మేడారం అడవుల్లో నేల గట్టిగా ఉండటంతో చెట్ల వేర్లు లోపలికి వెళ్లకుండా.. పక్కకు పాకి ఉంటాయని, సక్రమంగా భూమితో పట్టు లేకపోవడంతో పెనుగాలులకు త్వరగా నేలకూలే అవకాశం కూడా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈఏడాది ఆగస్టు 31న ఏర్పడిన విధ్వంసం టోర్నడోల వల్ల కాదని కొందరు వాదిస్తుంటే.. మరికొంత మంది శాస్త్రవేత్తలు మాత్రం పెనుగాలులే కారణంగా చెప్పుతున్నారు. దీనిపై శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేస్తుండటంతో ఓరుగల్లు ఏజెన్సీలోనే ప్రకృతి ప్రక్రోపానికి కారణం తెలుస్తుందనే చర్చ జరుగుతోంది.

వైపరిత్యాలను జంతువులెలా గుర్తించాయో..?

మేడారం అడవుల్లో ఆగస్టు 31న భారీ పెనుగాలుల విధ్వంసానికి భారీ వృక్షాలు నేలకూలినప్పటికి అడవి జంతువులేవీ మృత్యువాత పడకపోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 80వేలకు పైగా చెట్లు నేలకొరిగ్గా.. ఎక్కడా కూడా చిన్నపాటి జంతువు మృతి చెందిన ఆనవాళ్లు కనిపించలేదు. దీనికి కారణం జంతువులు, పక్షులు ప్రకృతి వైపరీత్యాల రాకను ముందే పసిగడతాయని అర్థమవుతోంది.

2023 జూలై 27న కుంభవృష్టి వానలకు మోరంచ, కొండాయి వాగుల్లో భారీగా వరద వచ్చి ఇళ్లను ముంచెత్తినప్పటికి మానవులు ముందుగా నష్టాన్ని అంచనా వేయలేక పోయారు. ఆ సమయంలో తాడుతో కట్టేయకుండా వదిలేసి ఉన్న పశువులు ముందే వరద విధ్వంసాన్ని పసికట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయాయి. కట్టేసి ఉన్న పశువులు అరుస్తూ తమ యజమానులను అప్రమత్తం చేయడం గురించి ఇప్పటికీ చర్చించుకుంటారు.

గ్లోబల్ వార్మింగ్ వల్లే వైపరిత్యాలు

ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, కెమిస్ట్రీ, ప్రిన్సిపాల్ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజ హనుమకొండ



పట్టణీకరణ, పారిశ్రామీకరణ పెరగటంతో వాతావరణ కాలుష్యం పెరగడం, గ్లోబల్ వార్మింగ్ వల్లే ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయి. గతంలో మేడారం అడవుల్లోకి ఎడ్లబండ్లపై వెళ్లేవారు. ప్రస్తుతం వాహన కాలుష్యం పెరిగింది. దీనికి తోడు వాతావరణంలో విషవాయువులు పెరిగి, సముద్రాల నుంచి తేమ పైకి వెళ్లకుండా అడ్డు పడుతున్నాయి. దీంతో ఆసాధారణ వర్షాలు పడుతున్నాయి. ములుగు ఏజెన్సీలో కొద్దిగా చెట్లు ఎక్కువగా ఉండటంతో గాలి ద్వారా ఈ ప్రాంతంలో కుంభవృష్టి వానలు కురుస్తున్నాయి. వైపరీత్యాలను గుర్తించే శక్తి జంతువులకు ఉన్న కారణంగానే మేడారం అడవుల్లో వేల చెట్లు నేలకూలినా జంతువులకు ఎలాంటి ప్రాణ జరగలేదు.

వాతావరణ అసమతుల్యం వల్లే..

ప్రొఫెసర్ ఎన్.రామస్వామి, బయోటెక్నాలజీ, కాకతీయ విశ్వవిద్యాలయం



వాతావరణంలో అసమతుల్యమే ప్రకృతి వైపరీత్యాలకు ప్రధాన కారణం. మన ప్రాంతంలో ఉండాల్సినంత వృక్ష సంపద లేకపోవడం, వాతావరణ కాలుష్యం పెరగటం కూడా ఓ కారణం కావొచ్చు. అయితే మేడారం అడవుల్లో టోర్నడోల వల్ల చెట్లు నేలకూలి పోకపోవచ్చు. దీనిపై లోతుగా పరిశోధనలు జరుగుతున్నాయి. సాధారణంగా గాలిలో అధిక పీడనంవల్ల ఇలాంటి వైపరీత్యాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సంఘటనలో తొలిసారిగా చూశా. అయితే సింగపూర్‌లో ఉన్న కొత్త టెక్నాలజీతో నేలకూలిన చెట్లను తిరిగి బతికించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయాలి.

క్రికెట్ క్రీడాభివృద్ధికి ప్రణాళికలు

- కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి
- సందడిగా అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కుడా చైర్మన్ ఇనుగాల

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికితీయడంతోపాటు జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి త్వరలోనే ప్రణాళికలు రూపొందిస్తామని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలను కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారులను తీర్చిదిద్దేలా జిల్లాలో క్రికెట్ క్రీడను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల క్రికెట్ క్రీడా మైదానంతో పాటు కోమటిపల్లిలోని ఫోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో అంతర్ జిల్లా స్థాయిలో 8జట్లు పాల్గొంటాయని, వీటికి అక్టోబర్ 5వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, అభినవ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు వరంగల్ - మహబూబ్‌నగర్ జట్ల మధ్య నిర్వహించిన పోటీలో ఆతిథ్య వరంగల్ జిల్లా ఓటమి చెందింది. మెదక్-నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్లగొండ జట్టు విజయం సాధించింది.

గురుకులాల్లో చాక్‌డౌన్-పెన్‌డౌన్

హనుమకొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ యాకూత్‌పుర గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు గురుకుల విద్య జేఏసీ పిలుపు మేరకు శనివారం టీటీఆర్ఈఐటీఏ ఆధ్వర్యంలో చాక్‌డౌన్-పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు విధులకు హాజరై బోధన, కార్యాలయ పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా గురుకుల సెక్రెటరీకి మెమోరాండం సమర్పించారు. తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రుషీకేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్. సతీష్‌కుమార్, స్థానిక యూనిట్ అధ్యక్షుడు ఇ.రాజన్న, సీనియర్ ప్రిన్సిపాల్ బి.మధు, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ భవానీ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

'ఆంధ్రజ్యోతి'తో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



కాకతీయఖని, సెప్టెంబరు 28: ప్రజలు, కార్మిక వర్గాల ప్రయోజనాలే తనకు ప్రధానమని సీపీఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. పోరాటాల ద్వారానే వారి హక్కులను సాధించుకుంటున్నానని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అనుభవాలను ఆయన పంచుకున్నారు.

మా స్వస్థలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలను చేశాను. 1983లో ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యార్థుల సమస్యలపై పోరాడాను. 1984లో సీపీఐ తరఫున వార్డు సభ్యుడిగా పోటీచేసి గెలిచాను. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవి పరిష్కారమయ్యే వరకు పోరాడాను. మా నాన్న కొరిమి వెంకటయ్య సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేసేవారు. ఆయన తన ఉద్యోగాన్ని వారసత్వంగా నాకు అప్పగించడంతో 1992లో ఇల్లందులో బదిలీ వర్కర్‌గా చేరాను. 2000లో సింగరేణి సంస్థ క్లర్క్‌గా ప్రమోషన్ ఇచ్చి భూపాలపల్లికి బదిలీ చేసింది. ఇక్కడ 2001లో ఏఐటీయూసీ నాయకత్వం బ్రాంచి కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించింది. 2012 వరకు కొనసాగాను. ఈ 11 ఏళ్ల కాలంలో కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశాను. ఏరియాలో ఫ్లోరైడ్ వాటర్‌తో కార్మికులు ఇబ్బందులు పడుతుంటే ప్లాంట్ ఏర్పాటు చేయించాను. భూపాలపల్లిలో గ్రేడియంట్ గనులు కావడంతో 2007-08లో 200 మంది కార్మికులు డిస్మిస్ అయ్యారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా పోరాడి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా తిరిగి వారికి ఉద్యోగాలు ఇప్పించారు. అలాగే సింగరేణి కార్మికులు ఇబ్బందులు పడుతుండటంతో ఎస్‌డీఎల్ యంత్రాలను తెప్పించాం. అలాగే మ్యాన్‌రైడింగ్ సిస్టం ఏర్పాటయ్యేలా కృషి చేశాం. భూపాలపల్లిలో రూ. 5లక్షలతో కొమురయ్య భవన్‌ను నిర్మించాను. 2006లో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా నన్ను పార్టీ నియమించింది. దీంతో ప్రజల సమస్యలపై ప్రత్యక్షంగా పోరాడే అవకాశం లభించింది. 2016లో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యాను. 2023 ఆగస్టులో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం వచ్చింది. అంతేకాకుండా ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్‌లో (ఐఎండబ్ల్యూఎఫ్) 2021లో జాతీయ కార్యదర్శిగా కూడా ఎన్నికయ్యాను. ఇలా అనేక పోరాటాలతో ప్రజలు, కార్మికుల సమస్యలను పరిష్కరించగలుగుతున్నాను. నా భార్యది కూడా అదే బాట. ఆమె కూడా ప్రజా సేవలోనే ఉంది. ఇద్దరు కుమారులు ఉన్నత చదువులు చదివి స్థిరపడ్డారు. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి?.

మేడారం అడవులకు పునరుజ్జీవం పోయాలి

సమ్మక్క, సారక్క దయతో విపత్తు నుంచి ప్రజలు క్షేమం

మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత వినోద్ కుమార్

తాడ్వాయి, సెప్టెంబరు 28: పెనుగాలులకు వేలాది చెట్లు కూలిపోయి ధ్వంసమైన మేడారం అడవికి పునరుజ్జీవం పోయాలని, అటవీ సంపద రక్షణకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం దారిలో ఆగస్టు 30న వచ్చిన విపత్తుకు వృక్షాలు కూలిపోయిన ప్రదేశాన్ని రిటైర్డ్ అటవీశాఖ అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. బంగాళాఖాతం, అరేబియా మహా సముద్రం నుంచి వీచిన గాలులు ఒత్తిడితో ఈప్రాంతంలోని 1,500 ఎకరాల్లో చెట్లు కూలిపోయాయని తెలిపారు. విలువైన అటవీ సంపద ధ్వంసం కావడం మనసును కలిచివేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కాంపా నిధులతో మొక్కలు నాటి అడవిని పెంచాలని సూచించారు. చెట్లు ధ్వంసమైన ప్రదేశానికి బయటి వ్యక్తులు వెళ్లి వాటికి హాని తలపెట్టకుండా కంచెను ఏర్పాటు చేయాలన్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ దయతోనే విపత్తు నుంచి ప్రజలు రక్షించబడ్డారని అన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులు అడవుల సంరక్షణకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, నాయకులు దుర్గం రమణయ్య, గంద్రకోట సుధీర్‌యాదవ్, పోరిక గోవింద్‌నాయక్, మసరగాని వినయ్‌కుమార్ యాదవ్, ప్రదీప్‌బాబు, తాడూరి రఘు, బాస పుల్లయ్య, భాస్కర్, గండెపల్లి నర్సయ్య, క్యాతం యాదగిరి, ఖలీల్, చంద్రబాబు, భోజారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నేలకూలిన వృక్షాలను పరిశీలిస్తున్న వినోద్ కుమార్, బీఆర్ఎస్ నేతలు

వనదేవతలకు ప్రత్యేక పూజలు

మేడారం : వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడి ద్దరాజు దేవతలను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ దర్శించు కున్నారు. పూలు పండ్లు పసుపు కుంకుమ కొబ్బరికాయలు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో దేవాదాయ అధికారులు, పూజారులు ఆయన్ను కండువాలు కప్పి సన్మానించారు. వినోద్ కుమార్ వెంట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు గ్రంథాలయ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్, తాడ్వాయి మండలం అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, భూక్య జంపన్న, తాటి కృష్ణ, ఆత్మా కమిటీ చైర్మన్ దుర్గం రామనయ్య తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంలో భువనేశ్వరి పీఠాధిపతి ప్రత్యేక పూజలు

మహదేవపూర్, సెప్టెంబరు 28 : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతిస్వామి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీపార్వతి అమ్మవారిని కమలానంద భారతి స్వామి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కమలానంద భారతి

ములుగు జిల్లాలో 30 క్రష్ సెంటర్లు

మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ అక్కేశ్వర్‌రావు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 28: ఏడు నెలల వయసు నుంచి మూడేళ్లలోపు చిన్నారుల సంరక్షణ కోసం ఉద్దేశించి క్రష్ సెంటర్లను ములుగు జిల్లా వ్యాప్తంగా 30చోట్ల ఏర్పాటు చేయనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్‌రావు తెలిపారు. జిల్లాలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన శనివారం సందర్శించారు. క్రష్ సెంటర్ల ఏర్పాటు అనుకూలతను పరిశీలించారు. నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆరు కేంద్రాలను ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ దివాకరను కలిసిన అక్కేశ్వర్‌రావు క్రష్ సెంటర్ల ఏర్పాటుపై చర్చించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాన్ని నియమించి పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ములుగులోని సఖి కేంద్రాన్ని సందర్శించిన ఆయన బాధిత మహిళలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. చైల్డ్ హెల్ప్ లైన్, సఖి సిబ్బందితో సమీక్ష జరిపారు. విధి నిర్వహణలో మానవతా ధృక్పదంతో సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ స్కీమ్స్ డైరెక్టరేట్ సీడీపీవో శ్వేత, జిల్లా సంక్షేమాధికారి కె.శిరీష, సీడీపీవోలు మల్లీశ్వరి, ప్రేమలత, ముత్తమ్మ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, సఖి సెంటర్ అడ్మిన్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన పెంచాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య

మంగపేట, సెప్టెంబరు 28: కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సూర్య పర్యటించారు. కమలాపురంలో వరంగల్ ఉమ్మడి జిల్లాల మాజీ ఉపాధ్యక్షుడు చింత పరమాత్మ తల్లి సంవత్సరీకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి ఇస్సార్‌ఖాన్, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

సన్నాలకు సై..

(5వ పేజీ తరువాయి)

తినేందుకు ఇష్టపడటం లేదు. సంపూర్ణ పోషణ స్వస్థ జీవన్ కార్యక్రమంలో భాగంగా విటమిన్ బి-12, ఫోలిక్ యాసిడ్‌ను కలిపి పంపిణీ చేస్తున్నప్పటికీ పిండి వంటలు, ఇతర అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. ఆహార భద్రత లక్ష్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు సన్న బియ్యం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి నుంచి అమలుచేసే అవకాశాలున్నాయి. ఈసారి ధాన్యం సేకరణ సమయంలో సన్నాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వ పిలుపుపై రైతులు స్పందించారు

- సురేష్, జిల్లా వ్యవసాయాధికారి

క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనకు రైతులు సానుకూలంగా స్పందించారు. సన్న రకం వడ్ల సాగుకు ముందుకు వచ్చారు. క్రాప్ బుకింగ్ సర్వే సమయంలో ఏవోలు, ఏఈవోలు రైతులను ఆదిశగా ప్రోత్సహించారు. ప్రస్తుతం వరి పైరును కొన్ని రకాల చీడలు ఆశిస్తున్నాయి. రైతులు ఇచ్చిన సమాచారంతో క్షేత్ర పరిశీలన చేసి నివారణ కోసం సలహాలు, సూచనలు ఇస్తున్నాం. వానాకాలం ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది.

ఫారెస్టు అధికారులకు రక్షణ కల్పించాలి

వాజేడు, సెప్టెంబరు 28: ఫారెస్టు అధికారులకు రక్షణ కల్పించాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగుడెంలో శనివారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలస గిరిజనేతరుల దాడులతో ఆదివాసీలు భయాందోళనకు గురువుతున్నారని అన్నారు. తాడ్వాయి మండలంలో ఫారెస్టు అధికారులపై జరిగిన దాడిని హేయమైన చర్యని అన్నారు. ఫారెస్టు అధికారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, చందు, శివ, రాజేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి

అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



బొగ్గులవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

మల్హర్, సెప్టెంబరు 28 : మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతం ఉన్న బొగ్గులవాగు ప్రాజెక్టుకు చిన్న కాళేశ్వరం ద్వారా నీటి తరలింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మండలంలో కలెక్టర్ శనివారం పర్యటించారు. పాత రుద్రారంలోని ఊర చెరువు విస్తరణ పనులను పరిశీలించారు. ఊర చెరువు నుంచి బొగ్గులవాగు ప్రాజెక్టుకు అనుసంధానం చేస్తూ నీటిని తరలించేందుకు అధికారులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. చిన్న కాళేశ్వరం నుంచి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు కాల్వలు, ఎత్తిపోతల ఆవశ్యకతపై అధికారులు సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందించాలన్నారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను బొగ్గులవాగు ప్రాజెక్టుకు నీటిని తరలించడం వల్ల అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని తెలిపారు. రుద్రారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఆంగ్ల పాఠాలు చక్కగా చదవడం పట్ల అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలన్నారు. అనంతరం తాడిచర్ల ఓసీపీని కలెక్టర్ పరిశీలించారు. చెల్పూరు కేటీపీపీకి బొగ్గును తరలించడానికి ఏర్పాటు చేయబోయే కన్వేయర్ బెల్టు వివరాలను జెన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. బెల్టు నిర్మాణం చేపడితే రవాణా భారం తగ్గుతుందని అధికారులు, కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలోని ఆర్అండ్ఆర్ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో దెబ్బతిన్న ఫ్లోర్ మరమ్మతులకు, సీపీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సీఈ సిద్ధయ్య, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు ఉన్నారు.

కలెక్టర్ వినతిపత్రం సమర్పించిన నిర్వాసితులు

పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ నిర్వాసితులు కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందించారు. ఓసీపీలో నిత్యం చేపట్టే బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని, తమ ఇళ్లను సేకరించి పరిహారం చెల్లించడంతో పాటు పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రామప్పలో 30న వేలం

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 28: మండలంలోని యూనెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో కొబ్బరి ముక్కలను పోగుచేసుకోనేందుకు ఈనెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణ అధికారి బిళ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవేలంలో పాల్గొనే పాటదారులు రూ.20 వేలు ధారవత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారికి అక్టోబరు 14 నుంచి ఏడాది పాటు కొబ్బరి ముక్కలు పోగుచేసుకోనేందుకు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు.

భగత్ సింగ్ జయంతి వేడుకలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 28: భగత్ సింగ్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రఘు, ఎస్ఎఫ్ఐ ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి రవితేజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● కాకతీయఖని : భూపాలపల్లి పట్టణంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు రమేష్, పవన్, లావణ్య, స్వరూప, సుమ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర పరిష్కారం

భూపాలపల్లి జిల్లా జడ్జి నారాయణబాబు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి నారాయణబాబు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 28: జాతీయ లోక్‌అదాలత్‌తో కేసుల ను సత్వరంగా పరిష్కరించు కోవచ్చని జిల్లా జడ్జి నారాయణ బాబు అన్నారు. కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌ను శనివారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కక్షిదారులు హాజరై తమ కేసులను పరిష్కరించుకొనేందుకు రాజీ పడ్డారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ కేసుల్లో కక్షిదారులు రాజీ పడగా వారిని అభినందించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడి జయరాంరెడ్డి, ప్రిన్సి పల్ జూనియర్ సివిల్ జడ్జి రామచందారావు, అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాల పల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేష్‌కుమార్, మల్లేష్‌తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి : శ్రీనుబాబు



మాట్లాడుతున్న దుద్దిళ్ల శ్రీనుబాబు

కాటారం, సెప్టెంబరు 28: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కాం గ్రెస్ రాష్ట్రనేత దుద్దిళ్ల శ్రీను బాబు అన్నారు. మండ లం లోని ధన్వాడలో శనివారం డీపీఎల్-9 మెగా క్రికెట్ టోర్నీని కాంగ్రెస్ నాయకులు, నిర్వాహ కులతో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉద్దేశించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా శారీరక ధృడత్వం, మానసికోల్లాసం కలిగించే క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ సర్పంచులు దేవేందర్‌రెడ్డి, అశోక్, నరేష్, నాయకులు తిరుపతిరెడ్డి, రవీందర్‌రావు, ప్రభాకర్, మహేష్, అశోక్, మొగిలి, సత్యనారాయణ, ఉంసింగ్, రాజశేఖర్, శ్రీకాంత్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రేబీస్ నివారణ దినోత్సవం

కాటారం, సెప్టెంబరు 28: మండలంలోని ధన్వాడ, కాటారం వెటర్నరీ ఆస్పత్రుల్లో శనివారం ప్రపంచ రేబీస్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి చెందిన పెంపకం కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్స్ వేశారు. రేబీస్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెటర్నరీ వైద్యులు రమేష్, ధీరజ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, వీఏ రాజశేఖర్, సిబ్బంది అక్రం పాల్గొన్నారు.

సరస్వతీ బ్యారేజీలో

ఇసుక మేటల తొలగింపు

మహదేవపూర్, సెప్టెంబరు 28: సరస్వతీ బ్యారేజీలో ఇసుక మేటలు తొలగించడానికి ఇంజనీరింగ్ అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం శనివారం బ్యారేజీలో గేట్లు పూర్తిస్థాయిలో 66 గేట్లను మూసివేశారు. దీంతో బ్యారేజీలో నీరు నిల్వ అయ్యి ప్రవాహం ద్వారా ఇసుక తొలగిపోయే అవకాశం ఉంది. అనంతరం మళ్లీ ఒక్కో గేటును తెరవనున్నారు. బ్యారేజీ ఈఈ యాదగిరి ఆధ్వర్యంలో క్లస్సింగ్ ప్రక్రియ ద్వారా ఇసుక తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువైతే ఒక్కో గేటు తీస్తూ ప్రవాహంతో పాటు ఇసుక వెళ్లే అవకాశం ఉంటుంది.

'మేడిగడ్డ'లో కొనసాగుతున్న ప్రవాహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 28: మేడిగడ్డ బ్యారేజీకి వరద కొనసాగుతోంది. శనివారం 2.10లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 3.40మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

రేషనలైజేషన్‌ను ఉపసంహరించాలి

కాటారం, సెప్టెంబరు 28: అశాస్త్రీయమైన టీచర్స్ రేషనలైజేషన్ జీవో 25ను ఉపసంహరించుకోవాలని టీఎస్‌ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఆర్. గణేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సంఘం నాయ కులతో ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ప్రతి 20మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లను కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. పాఠశాలల్లో ఖాళీలను సత్వరమే విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

'వివేకానంద'లో ముందస్తు బతుకమ్మ

కాటారం, సెప్టెంబరు 28: మండలకేంద్రంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అందంగా బతకమ్మలను పేర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కాటారం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉమారాణి, కరస్పాండెంట్లు వలుస వెంకటేశ్వర్లు, వందన తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

అర్హులందరికీ ఉపకరణాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

చిట్యాల, సెప్టెంబరు 28: అర్హులైన దివ్యాంగులు అందరికీ 12 రకాల సహాయ ఉపకరణాలు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. సంక్షేమ శాఖ జిల్లా అధికారి చిన్న య్య ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల దరఖాస్తు శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు, ఇతర పరికరాలు అవసరమైన దివ్యాంగులు వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూకల్లులో రాధాకృష్ణ ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారం భించారు. నిర్వాహ కులు చాడ జ్యోతి, సుదర్శన్‌రెడ్డి దంప తులను అభినందించారు. అలాగే స్థానిక సామాజిక ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాం త్ విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని వార్డులను సందర్శించి రోగుల బాగోగులు తెలు సుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిరంతరం ఆస్పత్రిలో అం దుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనా రా యణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, చిలుకల రాయకొమ్ము, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్‌గౌడ్, గంగాదరి రవీందర్, రాకేష్ నాయక్, బుర్ర శ్రీనివాస్, గోపగాని శివకృష్ణ, రాంబాబు తదితరులు ఉన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడిన ఘటనలు ఉన్నాయన్నారు. అలాంటివి మళ్లీ చోటు చేసుకోకుండా ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో శోభారాణి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శైలజ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ రమ్యరెడ్డి, ఎస్సై రబ్బాని, కాంగ్రెస్ ముఖ్య నాయకులు గాజర్ల అశోక్, దాట్ల శ్రీనివాస్, ఉడుత మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకులం విద్యార్థులు

కాటారం, సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ (బాలుర) గురుకులానికి చెందిన విద్యార్థులు బి.అజయ్, ఎల్.చరణ్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ విద్యార్థులు అక్టోబరు 2 నుంచి 5 వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, ప్రభాకర్ శనివారం వెల్లడించారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు చరణ్, అజయ్‌ను గురుకులం ప్రిన్సిపాల్ లాల్, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్ అభినందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్

చిట్యాల, సెప్టెంబరు 28: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోల్కొండ సురేష్ కోరారు. ఈమేరకు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు కావస్తుందని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశాడు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కోర్టుల భవన సముదాయాలు తరలించొద్దు

మాజీ కౌన్సిలర్ రేగుల రాకేష్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 28: కోర్టుల భవన సముదాయాల్ని ఇతర ప్రాంతాలకు తరలించొద్దని బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రేగుల రాకేష్ డిమాండ్ చేశారు. శనివారం కోర్టుకు కేటాయించిన ఆ స్థలం వద్ద కారల్ మార్క్సుకాలనీ, యాదవకాలనీ ప్రజలతో నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇల్లా కోర్టు, సబ్‌కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు, అడనల్ జూనియర్ సవిల్ జడ్జి కోర్టులు రాగా వాటి నిర్మాణం కోసం పట్టణంలోని కారల్‌మార్క్సుకాలనీ సమీపంలో సింగరేణి స్కూలు ముందు 11 ఎకరాల 20 గుంటల భూమిని సంవత్సరం క్రితం అప్పగించారన్నారు. ప్రస్తుతం కొంత మంది ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కోర్టు స్థలాన్ని గణపురం మండలం మైనారం గ్రామానికి తరలించాలని చూస్తున్నారన్నారు. ఆ ప్రయత్నాలను మానుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోనే కోర్టు సముదాయాలు ఏర్పడితేనే అందరికీ ఉయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మెండు దేవేందర్, చింతల నర్సయ్య, తుమ్మల స్వామి, పునేం ప్రకాశ్, శ్రీనివాస్, చింతల లత, నవీన్, ఇటుకల శంకర్, లక్ష్మి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

జనక్ ప్రసాద్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కాకతీయఖని, సెప్టెంబరు 28: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇప్పిస్తున్నందుకు కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ చిత్ర పటానికి భూపాలపల్లి సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సోషల్ మీడియా ఇన్‌చార్జి వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరగ్గా నాయకులు బుచ్చయ్య, రాజేందర్, సంపత్, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు

వాజేడు, సెప్టెంబరు 28: మండలంలోని జగన్నాథపురంలో శనివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. మండలంలోని ప్రగళ్లపల్లికి చెందిన ఖాసిం జగన్నాథపురంలో సెలూన్ షాపు వద్ద ఉండగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. మరో ముగ్గురు మహిళలపై దాడి చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఇటీవల పలు ప్రాంతాల నుంచి కుక్కలను పలువురు తీసుకొచ్చి గ్రామాల్లో వదులుతున్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో వాటి బెడద పెరిగి దాడులకు దారి తీస్తోందని స్థానికులు అంటున్నారు. కుక్కలను నియంత్రించాలని అధికారులను కోరుతున్నారు.

కేసుల్లో రాజీపడితే ప్రశాంత జీవనం

ములుగు జిల్లా జడ్జి సర్యచంద్రకళ



కేసు రాజీ ధృవీకరణ పత్రం అందజేస్తున్న న్యాయాధికారులు

ములుగు, సెప్టెంబరు 28: జాతీయ లోక్‌అదాలత్‌లలో కక్షిదారులు తమ కేసులలో రాజీ కుదుర్చుకోవడం ద్వారా ప్రశాంత జీవనం సాగించాలని జిల్లా జడ్జి, న్యాయ సేవా.దికార సంస చైర్మన్ ఎస్‌వీపీ.సూర్యచంద్రకళ అన్నారు. జిల్లా కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ శనివారం జరిగింది. నాలుగు బెంచీలను ఏర్పాటు చేయగా అత్యధికంగా 1156పెండింగ్ కేసులను పరిష్కరించారు. వీటిలో 976 క్రిమినల్, 90సివిల్, 61 ఎక్సైజ్, 17ఎంవీటీపీ, రెండు మెయింటనెన్స్ కేసులున్నాయని 10సైబర్‌క్రైమ్ కేసులున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కన్నయ్య లాల్, జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.రాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ సునిల్‌కుమార్, వీపీ రవికిరణ్, న్యాయవాదులు, పోలీసు అధికారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి రైతులకు శిక్షణ ఇస్తాం

నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ రవి చైతన్య

మంగపేట, సెప్టెంబరు, 28: మిర్చి రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు నిర్వహిస్తామని నాబార్డ్ ములుగు జిల్లా డెవలప్ మెంట్ మేనేజర్ తంగా రవి చైతన్య అన్నారు. మండలంలోని బోరునర్సాపురం, అకినేపల్లి-మల్లారం గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. బోరునర్సాపురంలో స్థానిక రైతులతో కలిసి మిర్చి క్షేత్రాలను పరిశీలించారు. మిర్చి విస్తీర్ణం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. మిర్చిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎగుమతికి అనువైన సాగు పద్ధతులను రైతులు పాటించేందుకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞానయాత్రలు త్వరలో నిర్వహిస్తామని అన్నారు. మహిళా రైతులు, వ్యవసాయ కూలీలకు ఎల్ఈడీపీ ప్రత్యేక శిక్షణను ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయ రంగంలో వికాస్ అగ్రిఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. వికాస్ అగ్రిఫౌండేషన్ చైర్మన్, జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ సభ్యుడు నాసిరెడ్డి సాంబశివరెడ్డి మాట్లాడుతూ మిర్చి రైతులకు సాంకేతిక శిక్షణతో పాటు రాయితీలపై వ్యవసాయ ఉపకరణాలు అందజేసేలా ప్రత్యేక కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన సమాఖ్య ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.రమేష్, వికాస్ అగ్రిఫౌండేషన్ డైరెక్టర్లు నేలపట్ల వసంతరెడ్డి, చెట్టుపెల్లి తిరుపతిరావు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.